

# మగ మనసులు

'కవిత'

(విశ్వం వేణూ స్నేహితులు. ఇద్దరిదీ దగ్గరగా ఒకే వయసు. ఇద్దరూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. ఇద్దరూ గుమాస్తాలే. ఇద్దరికీ ఒక్కసారే పెళ్ళయింది- మూడునెలల క్రితం. ఒకేయింటి తాలూకు పోర్షన్లలో యిద్దరూ పక్కపక్కనే కాపురం పెట్టారు. ఇవాళ బోనస్ యిచ్చారు ఆఫీసులో. ఒక్కొక్కరికీ వెయ్యేసి రూపాయలు వచ్చాయి. అది పట్టుకుని హుషారుగా బజారుకి బయలుదేరారు సాయంత్రం -- శ్రీమతులతో. షాపింగ్‌చేసి - సినిమాచూసి - మంచి హోటల్లో డిన్నర్ తీసుకుని యింటికి వచ్చారు పదకొండవుతూంటే.

విశ్వం భార్య నీరజ. వేణు భార్య శ్యామల. పక్కపక్క వాటాలు కావడంతోనూ, భర్తలు స్నేహితులు కావడంతోనూ, వాళ్ళిద్దరూకూడా అచిరకాలంలోనే దగ్గరి స్నేహితులైపోయారు. రేషన్ షాపునుంచి మార్నింగ్ షో వరకూ యిద్దరూకలిసే వెళ్తారు.) ఇక చదవండి.

ప్రస్తుత రంగం

పన్నెండవుతూంది.

విశ్వానికి నిద్రపట్టడంలేదు - వాతా

వరణం బాగానే ఉన్నా. పక్కనే నిద్రపోతున్న నీరజవంక చూశాడు. అతని మనసు అసంతృప్తితో బాధగా మూలిగింది. నీరజ - అందమైనదికాదు ... అలాగని అనాకారీ కాదు. సామాన్యంగా ఉంటుంది. రెండోసారి చూడాలనిపించదు. చూస్తే జ్ఞాపకమూ ఉండదు. ఏమీ ఏ ప్రత్యేకత లేని మనిషి. ఔను. అదే రుజువయిందో సాయంత్రం.

రిక్షావాళ్లుకూడా శ్యామలవేపే పరుగెత్తారు ఆమె ఎక్కితే తమ రిక్షా ధన్యమౌతుందన్నట్లు. శ్యామల అందంగా తయారయింది మరి. కళ్లు తిప్పుకోలేనంత చక్కని ఆకర్షణీయమైన ముఖం. సహజంగానే అందమైనది. ఆపైన చక్కగా అలంకరించుకుంది కూడాను. అందుకే ఆమె రోడ్డుమీదకు వచ్చేసరికి ప్రత్యేకంగా ....దొరసానిలా.... మహారాణిలా వెలిగిపోడం ప్రారంభించింది. రిక్షావాళ్లు ఆమెను బ్రతిమాలారు తమ రిక్షానెక్కి ధన్యంచేయమని. అఫ్‌కోర్స్ .... తాము సరదాగా నడుద్దామని నడిచారు. రోడ్డుమీద అందరి దృష్టి ఆమెమీదే. శ్యామల నడక కూడా హుందాగా ఉంటుంది మరి.

హోటల్లో నలుగురూ కూర్చున్నారు- కాఫీలు తీసుకుందామని. సర్వర్-భక్తుడిలా వచ్చి శ్యామలనే అడిగాడు ఏం కావాలని. అతను నీరజని చూడనేలేదు!

బట్టల షాపులో మాత్రం?

శ్యామల షాపులో అడుగుపెట్టడమేమిటి, ముగ్గురు సేల్స్‌బాయిస్ అతి వినయంగానూ మహాభక్తిగానూ ఆమెను సమీపించి ఆహ్వానించారు, తమ సేవలందుకుని తమను ధన్యులని చేయమన్నట్లు. నీరజముఖం చూసినవారే లేరు. నిజానికి షాపు ఎంతో రష్‌గా ఉంది కస్టమర్స్‌తో. కాని -శ్యామలకు స్పెషల్ ట్రీట్‌మెంట్! అది చూస్తూంటే తనకి చాలా బాధగానూ అవమానంగానూ అనిపించిందక్కడే. నీరజ ఎంత వ్యర్థజీవి! సినిమాహాల్లో సీట్లు చూపించేవాడుకూడా శ్యామలకే సేవకుడయ్యాడు! శ్యామల వెనుకే నడుస్తున్న నీరజని వాడు పట్టించుకోనే పట్టించుకోలేదు!

రూఫ్‌గార్డెన్‌లో డిన్నర్....అక్కడా మళ్లీ అదే భాగోతం. సప్లయర్-మిగిలిన వాళ్లు లేనట్లూ శ్యామల ఒక్కతే ఉన్నట్లూ ఆమె అవసరాలు మాత్రమే కనుక్కుంటూంటే - తనకి నిజంగా కోపమే వచ్చింది. శ్యామలవల్ల వేణుకి కొంత గుర్తింపు లభించింది. రిటర్న్‌లో ఆటో దొరకటం కష్టమైంది. చివరకు ఒక ఆటో దొరికింది కానీ తాము నలుగురు! ఆటోవాడు శ్యామల ముఖంచూసి- ఆమెకోసం అన్నట్లు రిస్క్ తీసుకున్నాడు!

ఆలోచిస్తున్నకొద్దీ విశ్వానికి అసూయా అసహనమూ ఎక్కువైపోతున్నాయి. తను - నీరజని చేసుకోడంలో తొందరపడిపోయాడేమో! ఏ ప్రత్యేకతా లేని.... వొట్టి సామాన్యురాలు తన శ్రీమతి! తను

దురదృష్టవంతుడు. కొంచెం వేచిఉంటే తనకి వేణుకిలాగ శ్యామలలాటి ప్రత్యేక వ్యక్తి శ్రీమతిగా లభించేదేమో! వేణు ఎంత అదృష్టవంతుడు! విశ్వానికి నిద్ర పట్టడంలేదు రాత్రి గడచిపోతున్నా. అతను నీరజకి దూరంగా జరిగి పోయాడు.

* * *

అవతల మంచంమీద – దూరంగా – పడుకున్న శ్యామలవేపే చూస్తున్నాడు వేణు. అతనికి వొళ్ళు మండిపోతూంది. ఇంటిదగ్గరకూడా శ్యామల అందంగానూ ఆకర్షణీయంగానే ఉంది – మేకప్ తీయని సినిమాతారలా. ఎందుకిలాగ ? జరిగిన చేదు అనుభవాలు చాలవూ? రోడ్డుమీద రిక్షావాళ్లు.... ప్రజలూ...ఎలాగచూశారని ఆమెవంక! హోటల్లో సర్వరూ....బట్టల షాపులో సేల్స్‌బాయ్‌సూ, ప్రొప్రయిటరూ .... చివరకి – సినిమాహాల్లో సీట్లు చూపించేవాడితో సహా – ఎంత ఆశగా నీచంగా చూశారామెవేపు! ఆ చూపులని చూస్తూంటే తనకి వొళ్లుమండిపోయింది. కార్యక్రమం ఆపేసి అక్కడినుంచి అక్కడే వెనక్కి వొచ్చెయ్యాలన్నంత కోపం వచ్చింది. ఎలాగో నిగ్రహించుకున్నాడు. పగటివేషగాళ్ల చుట్టూ మూగినట్లు శ్యామలచుట్టూ జనం చేరాలని తాపత్రయపడిపోతూంటే – ఆమె భర్తఐనందుకూ ఆమె పక్కన ఉండవలసి వచ్చినందుకూ తనమీద తనకే అసహ్యం వేసింది. భార్యా రూపవతీ శత్రుః .... పెద్దలు ఎంత అనుభవంమీద చెప్పారు! ....నిజంగా శ్యామల తనని శత్రువులాగే హింసించి వదిలింది రోడ్డుమీద. ఇప్పుడు యింట్లో మాత్రం? ఆమె ఎలాగ కనిపిస్తూంది తనకి? అందరి నీచపు చూపులూ పడి – ఎంగిలయిన రొట్టెలాగ! అందరి అసహ్యకరమయిన దృష్టులూ సోకి మలినమయిన కుసుమంలాగ. ఔను. అందుకే ఆమెను దగ్గరగా తీసుకోలేక పోయాడు మునుపటిలాగా. ఈ బాధ జీవితాంతమూ వదలదు కాబోలు. తను తొందరపడ్డాడు శ్యామలను చేసుకోడంలో. తన జీవితానికి సుఖం ఉండదిక. నీరజలా గంభీరంగా.... సాదాగా ఉండే అమ్మాయిని వివాహం చేసుకుంటే తనకీ ఆవేదన ఉండేదికాదు. సుఖపడేవాడు. విశ్వం ఎంత అదృష్టవంతుడు! మగవాడి జీవితానికి నీరజలాటివాళ్లు సుఖాన్నందిస్తే – శ్యామలవంటి వాళ్ళు సమస్యలని మాత్రమే అందిస్తారు!

ఎంతకీ నిద్రరాక సిగరెట్ అంటించి వరండాలోకి వచ్చిన వేణుకి – అవతల ఎర్రగా కాలుతూ మరో సిగరెట్ ఎదురయింది. అది – విశ్వానిది!

వీళ్లిద్దరూ ఆ అర్ధరాత్రి మనసులు విప్పుకుని మాట్లాడుకోగలిగితే – ఈర్ష్యాసూయలూ, అసంతృప్తి ఆడవాళ్లకి మాత్రమే పరిమితంకావన్న పరమ సత్యంతోపాటు పొరుగువాడి పొలం పచ్చన అనే సామాన్య సత్యం కూడా బయటపడి ఉండేదేమో!

---